క్లుప్తంగా

అధికారులను తప్పించాలని తీర్మానం

పినపాక: పినపాక మండల పరిషత్ అధికారులు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ శ్రీనివాస రావులను విధుల నుంచి తప్పించాలని కోరుతూ పినపాక మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గురువారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆ ప్రతులను ఎంపీపీ గుమ్మడి గాంధీ అందజేశారు. కొన్ని నెలలుగా ఈ అధికారులు పనులు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సర్పంచ్‌లు, కార్యదర్శులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పూర్తి

మణుగూరుటౌన్: మణుగూరు సహకార సంఘం ఆధ్వర్యంలో 2022–23 వర్షా కాలంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు పూర్తిచేసినట్లు సహకార సంఘం చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మణుగూరు మండలానికి సంబంధించి 9 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మొత్తం 1,366 మంది రైతుల నుంచి 1,06,584 క్వింటాల ధాన్యం కొనుగోలు చేసినట్లు, రూ.21,74,31,360లు చెల్లించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి టి.జ్ఞానదాసు, సిబ్బంది తాజుద్దీన్, రాఘవులు, శివ, సతీష్‌లు పాల్గొన్నారు.

విప్‌ను కలిసిన జీఎం

మణుగూరురూరల్: మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావును నూతనంగా బాధ్యతలు చేపట్టిన మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పాల్వంచ డీఎస్పీ వెంకటేష్‌లు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం రేగా వీరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

మణుగూరురూరల్: మండలంలోని లంకమల్లారం గ్రామపంచాయతీలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సర్పంచ్ కృష్ణవేణి పర్యవేక్షణలో కుష్ఠు వ్యాధిపై అవగాహన ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పిల్లలకు వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. చెరువుముందు సింగారంలో ఫీవర్ సర్వేను పరిశీలించి గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంటీఎస్ అరుణ్‌బాబు, వైద్యసిబ్బంది రాంప్రసాద్, సుమ, విజయ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై శిక్షణ

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో వాలంటీర్స్‌కు ఎయిడ్స్, కుష్ఠువ్యాధులపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సూపర్ వైజర్ మధుబాబు మాట్లాడుతూ.. సురక్షితం కానీ లైంగిక సంబంధాలు, కలుషిత రక్తమార్పిడి, ఇంజెక్షన్ వల్ల.. బాధిత తల్లి నుంచి బిడ్డకు ఎయిడ్స్ సోకుతుందని తెలిపారు. ఉప సర్పంచ్ బొల్లి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, లింక్ వర్కర్ జరీనా, కార్యకర్తలు విజయనిర్మల, వనజాక్షి, సరళ, వీరకుమారి యువత పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దుమ్ముగూడెం: అంగన్‌వాడీ టీచర్లు ఆయాల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 6న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) నాయకులు పాయం రత్నకుమారి, సాధన పల్లి చిన్నారి, పూణెం నరసమ్మలు కోరారు. గురువారం రేగుబల్లిలో జరిగిన అంగన్‌వాడీల సమావేశంలో ప్రసంగించారు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ సలోమికి అందించారు. చెల్లాయి, పాప, ఎస్.వేదాబాయి, ఎస్.హేమలత, పి.లక్ష్మి, డి.వెంకటరత్నం, ఎస్.లక్ష్మీదేవి, గొంది లలిత, సావిత్రి, శ్రీదేవి, నాగమణి, ప్రభావతి పాల్గొన్నారు.

అశ్వాపురం: అంగన్‌వాడీల పలు సమస్యలపై ఈ నెల 6న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను సిబ్బంది జయప్రదం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ డిమాండ్ చేశారు. వెంకటాపురం గ్రామంలో గురువారం జరిగిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో మాట్లాడారు. హంసవేణి, శైలజ, శ్రీలత, పుల్లమ్మ, రజిత, రమణ, కళావతి, పద్మ, నాగమణి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

మణుగూరురూరల్: శివలింగాపురంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శ్రీవిద్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ముద్రించిన మహాశివరాత్రి వాల్‌పోస్టర్లలను మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు గురువారం ఆవిష్కరించారు. బద్దం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, నవీన్, నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు భాస్కరరావు, అచ్చయ్య, ఈఓ సుదర్శన్, ఇన్స్‌పెక్టర్ బేల్‌సింగ్, అర్చకులు అద్వైత్ శర్మ పాల్గొన్నారు.

పడకేసిన ‘పల్లె ప్రకృతి’

- నిర్వహణ లోపించడంతో అస్తవ్యస్తంగా వనాలు
- ఎండిపోతున్న మొక్కలు.. అపరిశుభ్రంగా పరిసరాలు
- ఏనాడూ అడుగుపెట్టని ప్రజలు
- వృథా అవుతున్న ప్రజాధనం



అడవిలో శ్మశాన వాటిక పక్కనే నిర్మించిన పల్లె ప్రకృతి వనం

మణుగూరుటౌన్: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రతి పంచాయతీలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు ఆదరణకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, పట్టణ ప్రకృతి వనాలు కనీస సౌకర్యాలు లేక వేసి తాళం తీయకుండా ఉంటున్నాయి. వాటి నిర్వహణ గాలికి వదలడంతో కొన్ని చోట్ల వేసిన మొక్కలు ఎండిపోయాయి. మరికొన్ని చోట్ల ఆకతాయిలకు, మద్యం సేవించే వారికి అడ్డాలుగా మారిపోయినాయి.

అడవులను తలపిస్తున్న వైనం

ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన ప్పటికీ.. జనావాసాల్లో స్థలాలు దొరక్క మండలలోని గుట్టమల్లారం, ముత్యాలమల్మనగర్, కూనవరం, సమితిసింగారం, సాంబాయిగూడెం, పడిగేరు, బుగ్గ పంచాయతీల్లో ఫారెస్టు భూముల్లో అడవుల మధ్య ఏర్పాటు చేశారు. ఎడబాటుగా ఉన్న ఈ ప్రాంతాల్లోకి ప్రకృతివనాల ఆలనాపాలనా మరిచారు. దీంతో అవి చుట్టూ ఉన్న అడవిలో కలిసిపోయాయి.

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

పగలంతా కష్టపడి పనిచేసిన ప్రజలు సాయంత్రం పల్లే ప్రకృతి, పట్టణ ప్రకృతి వనాలకు వచ్చి సేద తీరుతారనే లక్ష్యంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఈప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. కానీ ఆచరణలో ఆ లక్ష్యం నెరవేరడం లేదు. వాటిని నిర్మించిన నాటి నుంచి నేటి వరకు వాటిలోకి ఎవరూ వెళ్లిన దాఖలాలు లేవు. ప్రజల ఇళ్లకు దూరంగా ఉండడంతోపాటు వాటిని పరిశుభ్రంగా ఉంచడంలో స్థానిక పాలకులు విఫలమవడంతో జనం అటువైపు వెళ్లడం లేదు. ఇలా లక్ష్యం నెరవేరకపోడంతో వీటి నిర్మాణానికి ఉపయోగించిన ప్రజాధనం వృథా అయినట్లు స్పష్టమౌతోంది. ఇప్పటికైనా అధికారులు వాటిని పరిశుభ్రం చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని కోరుతున్నారు.

అడుగు పెట్టినవారే లేరు..



ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన పల్లే ప్రకృతి వనాల్లో ఇప్పటివరకు అడుగు పెట్టిన మనిషి లేడు. ఊరు బయట ఏర్పాటు చేయడమే కారణం. పైగా వాటిలో వేసిన మొక్కల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎండి పోయాయి.

– వెర్పుల శ్రీరాములు, శాంతినగర్, మణుగూరు

శుభ్రంగా లేకపోతే ఎలా వెళ్లగలం?



ప్రభుత్వం ఎంతో ఖర్చుచేసి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు పరిశుభ్రంగా ఉంచడం లేదు. ఇలా అయితే వాటిల్లోకి ప్రజలు ఎలా వెళ్తారు. కొన్ని వనాలు శ్మశాన వాటికల పక్కన, మరికొన్ని దూరంగా ఏర్పాటు చేయడంతో జనం వెళ్లలేకపోతున్నారు.

– పిట్టల నాగమణి, సమితిసింగారం, మణుగూరు

రవాణా వ్యవస్థ పటిష్టతకు కృషి



టికెట్ కొని ఆర్టీసీ బస్ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. గురువారం పట్టణంలోని సురక్షా బస్టాండ్ వద్ద మణుగూరు–హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సును విప్ రేగా కాంతారావు చేతుల మీదుగా ప్రారంభించారు. బస్సులో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రవాణా రంగంలోని పోటీని తట్టుకుని ముందుకు సాగేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని, అందుకు తెలంగాణ ప్రభుత్వ సహకరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహారావు, డిపో మేనేజర్ టి.స్వామి, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, డిపో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ స్క్రీనింగ్ టెస్టులు

బూర్గంపాడు: బూర్గంపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మెడికల్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ మానస అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చిన్యా, అధ్యాపకులు సీహెచ్ నాగేశ్వరరావు, డి.శ్రీనివాస్, సుమన్‌కుమార్, ఎస్ఎస్ కుమార్, ముకుందం, సాహితి, నరేష్, జరీనాబాను, శివప్రసాద్, శ్రీను, రేష్మ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

అశ్వాపురం: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు రేగా విష్ణుచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లెలమడుగు, మొండికుంట, నెల్లిపాక, రామచంద్రాపురం, గరిబడ్డు, సత్యనారాయణపురం, గొల్లగూడెం, సర్వాయిపాడుబంజర, కాలువబజార్ గ్రామాల్లోని యువతకు గురువారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, సర్పంచ్‌లు కోడి కృష్ణవేణి, వెంకటరమణ, ఎంపీటీసీలు జయ, ఏనిక రవి, ఉపసర్పంచ్ సుధీర్, పీఏసీఎస్ డైరెక్టర్ కాసరబాద సందీప్, నాయకులు తూము రాఘవులు, పున్నారావు, మంగళగిరి రామకృష్ణ, దాసు, జావీద్, హుస్సేన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: రేగా విష్ణు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బూర్గంపాడు మార్కెట్‌యార్డులో మండలంలోని పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులకు 50 వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు కొడెం వెంకటేశ్వర్లు, కుంజా చిన్నబ్బాయి, కొనకంచి శ్రీనివాస్, గొనెల నాని, మర్రి సాంబారెడ్డి, మేకల నర్సింహారావు, సాధిక్‌పాషా, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, మొండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, పొడియం నరేందర్, భూపెల్లి నర్సింహారావు, చుక్కపల్లి బాలాజీ, తిరుపతి ఏసోబు, బిట్ర సాయిబాబా, కుర్సం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన



అశ్వారావుపేటరూరల్: వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

అశ్వారావుపేటరూరల్: రోగులు, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గురువారం పీహెచ్‌సీల వద్ద ఆశ వర్కర్లు ఆందోళన చేశారు. మండల పరిధిలోని వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ధర్నా చేసి ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలను పీహెచ్‌సీ వైద్యులకు అందించారు. కార్యక్రమాల్లో భారతి, నాగమణి, సమత, విజయలక్ష్మి, విష్ణుకుమారి, బూదెమ్మ, వెంకాయమ్మ, లక్ష్మి రమణ, చిలకమ్మ పాల్గొన్నారు.

ములకలపల్లి: ఆశా వర్కర్లకు ప్రభుత్వం ప్రసూతి సెలవులు ప్రకటించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి దుబ్బా ధనలక్ష్మి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించి, వైద్యాధికారి సాయికల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ.. నెలకు రూ.6 వేల వేతనం అములుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో నల్లి సుజాత, కుంజా కుమారి, అన్నవరపు శైలజ, తాటి దుర్గ, కొడిమె ఇందిర, మేరీ, కురం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు ఆశావర్కర్లు గురువారం వినతిపత్రం అందజేశారు. నిర్ణీత వేతనాలకు సంబంధించి ప్రభుత్వం జీవో చేయాలని, వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హత గల ఆశావర్కర్లతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేగా కాంతారావు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: తన భర్త ప్రసాద్ కొంత కాలంగా అదనపు కట్నం కోసం మానసీకంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడని పట్టణంలోని జగదీష్ కాలనీకి చెందిన అన్నపూర్ణ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై..

పట్టణంలోని రంగనాయకుల గుట్టకు చెందిన భట్టా మమత అదే కాలనీకి చెందిన తన చిన్న మామయ్య లక్ష్మీనారాయణపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. డ్రైయినేజీకి సంబంధించి గొడవలో భాగంగా తనపై రాయితో దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేశారు.

ఆలయ వార్షికోత్సవం

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి గ్రామ శివారులోని ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలు, పండ్లతో అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం చేసిన పలువురు దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి దాతలు గారపాటి సూర్యనారాయణ అనురాధ దంపతులు, పర్వతనేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా ఇవ్వాలి

ములకలపల్లి: వ్యవసాయరంగానికి 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వాలని తెలంగాణా రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, గొగ్గల ఆదినారాయణ, గోపగాని లక్ష్మీనర్సయ్య, ఊకంటి కిషోర్, కురం సందీప్, గడ్డం వెంకటేశ్వర్లు, వినోద్, శ్రీరాములు, నాగులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న ఆరోగ్యలక్ష్మీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి కోరారు. మండల పరిధిలోని నారంవారిగూడెంలో గురువారం బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నారం రాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను..

అశ్వాపురం: ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి అన్నారు. ఆ గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, పంచాయతీ కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలి

భద్రాచలంటౌన్: పట్టణంలోని అర్హులైన దళితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శేఖర్, మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్‌లోని డీడీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు, రవి, ఆదిలక్ష్మి, కుమారి, స్వాతి, శ్రీను, రాజారావు పాల్గొన్నారు.

మోడల్ అంగన్‌వాడీలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్

భద్రాచలం: జిల్లాలోని అంగన్‌వాడీ పాఠశాలలకు అన్ని రకాల వసతి సౌకర్యాలను కల్పించి మోడల్ అంగన్‌వాడీలుగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ అన్నారు. బుధవారం రాత్రి ఐటీడీఏ సమావేశ మందిరంలో 9 గ్రామలోని 77 అంగన్‌వాడీ సెంటర్లకు ప్రధానమంత్రి ఆది ఆదర్శ్ గ్రామీణ యోజన పథకం కింద మౌలిక వసతులు కల్పించడానికి, వివిధ రకాలైన సామగ్రిని ఎంపిక చేసి కొనుగోలు చేయడానికి టెండర్ ప్రక్రియలను పూర్తి చేశారు. సుమారు రెండు కోట్ల వ్యయంతో పిల్లలకు 16 రకాల ఆట వస్తువులు, కుర్చీలు, టేబుల్స్ తదితర వాటికై టెండర్‌లను ఖరారు చేశారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజ్ మాట్లాడతూ.. నాణ్యతతో కూడిన వస్తువులు, సామగ్రిని సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, ఎస్ఓ సురేష్ బాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, సీడీపీఓలు చైతన్య, డి.సలోమి, ఎం.లక్ష్మీ ప్రసన్న, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్ నుంచి వచ్చిన ఏజెన్సీదారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్‌పార్లమెంట్

చండ్రుగొండ: మండలంలోని బెండాలపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం మాక్‌పార్లమెంట్ నిర్వహించారు. పార్లమెంట్ సభల నిర్వహణ, చట్టాలు రూపొందించే విధానాలపై వివరించారు. స్పీకర్, సభ్యుల వేశాధారణలో విద్యార్థులు మాక్‌పార్లమెంటులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.నర్సింహారావు, బి.కోటేష్, అనురాధ, రాజేష్, విజయ, సక్కుబాయి పాల్గొన్నారు.

6న తిరుపతమ్మ కల్యాణోత్సవం

బూర్గంపాడు: మండల పరిధిలోని మణుగూరు క్రాస్‌రోడ్‌లోని శ్రీ తిరుపతమ్మ దేవాలయంలో ఈ నెల 6న అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవకమిటీ తెలిపింది. గురువారం విడుదల చేసిన ప్రకటనలో రాత్రి 7.55 గంటలకు కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కస్తూర్బా పాఠశాలలో తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీలత

బూర్గంపాడు: బూర్గంపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురువారం జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజన వివరాలు, వసతులు, సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని, అందుకోసం ఉపాధ్యాయులు కృతనిశ్చయంతో పనిచేయాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు భూపెల్లి నర్సింహారావు, షాదిక్‌పాషా, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

చండ్రుగొండ: ఆర్టీసీల బస్సుల్లో ప్రయాణం సురక్షితమని కొత్తగూడెం డిపో అధికారిణి బీఎస్ రాణి అన్నారు. మండలకేంద్రం చండ్రుగొండలో గురువారం ప్రజా రవాణా చైతన్యరథం చండ్రుగొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఆర్టీసీ సంస్థ అందిస్తున్న సేవాపథకాలను నాటికలు, పాటల ద్వార వివరించారు. ఏఎస్ఐ కోటేశ్వరరావు, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఆర్పీ సామెల్, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం డి.నర్సింహారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

మణుగూరురూరల్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వేతన పెంపు విషయంలో న్యాయం చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ నంబర్ 22 గెజిట్ అయ్యేలా సీఎం కేసీఆర్ దృష్టి తీసుకెళ్లి అమలుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు గురుమూర్తి, రవికుమార్, శంకర్‌నాయక్, వెంకటేశ్వర్లు, సాయికుమార్, టైసన్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, రాజపల్లి, శివరామకృష్ణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరుటౌన్: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బుర్ర సోమేశ్వర్‌గౌడ్ కోరారు. మణుగూరులో గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో కొనసాగుతున్న పాదయాత్రలో జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, వైఎస్ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

మండలంలో పొంగులేటి పర్యటన




తునికేసి లక్ష్మిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అశ్వాపురం: అశ్వాపురం ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ సాయిబాబా ఆలయాన్ని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.30వేలు విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా, మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గుంజాల కృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మెడలో పుస్తెలతాడు చోరీకి గురైన మొండికుంటకు వాసి తునికేసి లక్ష్మిని పరామర్శించి చోరీ విషయాలు అడిగి తెలుసుకున్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు తిప్పారెడ్డి నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిట్యాల యాకమ్మను పొంగులేటి పరామర్శించారు. ఆనందాపురం గ్రామంలో లంకమళ్ల వెంకటసత్యం కుటుంబాన్ని పొంగులేటి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు ముత్తినేని వాసు, ఓరుగంటి రమేష్, వేములపల్లి రమేష్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కందిమళ్ల రాంరెడ్డి, సురకంటి వెంకటరమణ, రాగం మల్లయ్య నాయకులు పాల్గొన్నారు.

6న ఆత్మీయ సమ్మేళనం

దమ్మపేట: మండల పరిధిలోని నెమలిపేట గ్రామ శివారు వద్ద ఉన్న క్రీడా మైదానంలో ఈ నెల 6న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ సమ్మేళనానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.



అటెన్షన్ ప్లీజ్

సాగునీటికి అడ్డుగా..



మండల పరిధిలోని దబ్బతోగు ప్రాజెక్ట్ కాలువలు, తూములు పూడికతో మూసుకుపోతున్నాయి. వందలాది ఎకరాలకు సాగు నీరు అందించే ఈ ప్రాజెక్ట్ ప్రధాన కాలువతోపాటు, తూముల్లో పూడిక మట్టితో నిండిపోయి, సాగునీరు పారడం లేదు. దాంతో రైతులు సాగు చేస్తున్న మిర్చి, వేరుశెనగ, మొక్కజొన్న పంటలకు సాగునీరు అందడం లేదు. నీటి పారుదల శాఖ అధికారులు తక్షణమే పూడిక తీయించే పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– అశ్వారావుపేటరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: కేఎన్‌డీ కృష్ణ, ఇరిగేషన్ ఏఈ, అశ్వారావుపేట
ఫోన్ నంబర్: 97046 83349